క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కొండారెడ్డి



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డి

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ నాయకుడు, కొమరోలు మాజీ సర్పంచ్ పంది వెంకటేశ్వర్లను ఆదివారం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి పరామర్శించారు. గత కొంతకాలంగా వెంకటేశ్వర్లు అనారోగ్యంగా ఉన్న విషయం తెలుసుకుని కొండారెడ్డి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయంపై అన్ని విషయాలు తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిరెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, యంగ్రపల్లిస్వామి, రోసిరెడ్డి, ఆవుల చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పెద్దారవీడు: రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో దేవరాజుగట్టు గ్రామం సమీపంలో కాశినాయన ఆశ్రమం దగ్గర పోలీసులు ముమ్మరంగా వాహనాలు ఆదివారం తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ తదితర పత్రాలను పరిశీలించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదని, డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

పుల్లలచెరువు: పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని పీవీపల్లి జెడ్పీ నూతన హెచ్‌ఎం ఎన్.వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో హెచ్‌ఎంల బదిలీ కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు, పీవీపల్లి జెడ్పీ పాఠశాలలకు నూతన హెచ్‌ఎంలను జిల్లా అధికారులు నియమించారు. హెచ్‌ఎంగా వెంకటేశ్వరరెడ్డి, పుల్లలచెరువు హెచ్‌ఎంగా ప్రభూజీలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు నూతన హెచ్‌ఎంలకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.



కురిచేడులో షాప్ నంబర్ 10 వద్ద రేషన్ కోసం వేచివున్న కార్డుదారులు



వెంగాయపాలెంలో తహసీల్దార్ రాకకోసం ఎదురు చూస్తున్న కార్డుదారులు, రెవెన్యూ సిబ్బంది



పెద్దారవీడులో చౌకదుకాణం వద్ద వేచి ఉన్న కార్డుదారులు

ఎదురు చూపులు..
నెత్తిన మూటలు

- మళ్లీ మొదలైన రేషన్ కష్టాలు
- సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారుల ఇక్కట్లు
- అందుబాటులో లేని సరుకులు
- ఎండలో పడిగాపులు

కురిచేడు: రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఇన్నాళ్లు హాయిగా ఇంటి వద్దనే సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మంచి పథకాన్ని చూసి కన్నుకుట్టిన సీఎం చంద్రబాబునాయుడు ఈర్ష్య, ద్వేషంతో ఇంటివద్దకే రేషన్ పథకాన్ని రద్దు చేశారు. ఎండీయూ ఆపరేటర్‌లను స్మగ్లర్లతో పోల్చి అవమానించారు. ఫలితంగా లబ్ధిదారులు కొన్ని కిలో మీటర్లు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. దాంతో కూలీలు, పేదలు తమ పనులు తాము చేసుకుంటూ తాము ఇళ్ల వద్ద ఉన్న సమయంలో రేషన్ బండి వచ్చి రేషన్ ఇచ్చిపోయేది. దీంతో వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదని, చక్కగా తమ పనులు చేసుకుంటూ రేషన్ తీసుకున్నామని పేదలు పేర్కొంటున్నారు. తొలిరోజే సర్వర్ లేక కొన్ని గంటలు వేచి చూడాల్సి రాగా, ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సిన రేషన్ సరఫరా తహసీల్దార్ రజనికుమారి రాకకోసం 9.30 గంటల వరకు కార్డుదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే రేషన్ కోసం తిరిగి షాపుల వద్దకు వెళ్లాల్సి వస్తుందని, రేషన్ డీలర్ సమయానికి లేకపోతే తిరిగి మళ్లీ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా రాబోయేది పనుల కాలం కావడంతో రోజుకు రూ.500–900 వరకు కూలి నష్ట పోవాల్సివస్తుందని పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీలరు అందుబాటులో లేకపోయినా, టెక్నికల్ సమస్యలు తలెత్తినా కూడా తాము తిరిగి మళ్లీ ఇంకొక రోజు వెళ్లాల్సివస్తుందన్నారు. అలాగే మండలంలోని కాటంవారిపల్లె, గొల్లపాలెం, వెంగాయపాలెం, గుట్టమీదపల్లె తదితర ప్రాంతాల నుంచి రేషన్ కోసం కిలోమీటర్ల కొద్ది పోవాల్సివస్తుందని, ఆయా ప్రాంతాల్లో కూడా రేషన్ షాపులు ఏర్పాటు చేస్తే పేదలకు రేషన్ సరుకులు అందుబాటులో ఉంటాయని పేదలు పేర్కొంటున్నారు. మొదటి రోజు దివ్యాంగులకు ఇంటివద్దే రేషన్ ఇస్తామన్న హామీ ఎక్కడా కనిపించలేదు. రేషన్ మొత్తం కూడా వంద లోపు అవుతుందని, కాని వాటిని ఇంటిని తీసుకురావడానికి అయ్యే ఖర్చు ఎక్కువవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ సరుకుల కోసం అవస్థలు..

పెద్దారవీడు: రేషన్ కోసం కార్డుదారులు చౌకదుకాణాల వెళ్లి క్యూలో నిరీక్షించే అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌షాపుల వద్ద జనం బారులు తీరారు. తీరా చూసేసరికి సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడ్డారు.

సర్వర్ పనిచేయడం లేదని..
తెరుచుకోని రేషన్ షాపులు

యర్రగొండపాలెం: సర్వర్ పనిచేయడం లేదనే నెపంతో తొలిరోజే రేషన్ షాపులు తెరవలేదు. నియోజకవర్గంలో మొత్తం 173 రేషన్ షాపులు ఉండగా వాటిలో దాదాపు 50 శాతం షాపులు తెరుచుకోలేదు. యర్రగొండపాలెం పట్టణంలోని అనేక షాపులతోపాటు మండలంలోని వీరభద్రాపురంలో ఉన్న 3షాపులు, గంజివారిపల్లెలో ఉన్న ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన రేషన్ షాపు, జనరల్ రేషన్ షాపులు మూతవేసి ఉన్నాయి. ఎండీయూ వాహనాలు తమ ప్రాంతానికి వచ్చి రేషన్ బియ్యం సరఫరా చేస్తారన్న నమ్మకంతో లబ్ధిదారులు ఉన్నారు. వాహనాలు రద్దుచేశారన్న విషయం తెలుసుకున్న అనేక మంది తమ రేషన్ కార్డులతో ఆయా ప్రాంతాల్లోని రేషన్ షాపులవద్దకు వెళ్లారు. తీరా అవి మూసేసిఉండటంతో వెను తిరిగారు. సర్వర్ పనిచేయక పోవడంవలన వెంకటాద్రిపాలెం రేషన్ షాపువద్ద చెంచు మహిళలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. రేషన్ షాపులలో బియ్యం తీసుకున్న మహిళలు వాటిని తమ ఇంటికి ఏ విధంగా చేర్చుకోవాలన్న ఆలోచనలో పడ్డారు. కొన్ని షాపులలో బియ్యానికి బదులు నగదు తీసుకునే లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇచ్చారు.



కురిచేడులో షాప్ నంబర్ 15లో ఖాళీగా ఉన్న రేషన్‌షాపు

రేషన్.. పరేషాన్

దొనకొండ/తాళ్లూరు: కూటమి ప్రభుత్వం వచ్చింది. రేషన్ లబ్ధిదారులకు పరేషాన్ మొదలైంది. దొనకొండ మండలంలో 18 పంచాయతీలో 28 రేషన్ దుకాణాలు ఉన్నాయి. గ్రామాల్లో సర్వర్ సమస్యతో లబ్ధిదారులు రేషన్‌కు మందకొడిగా వచ్చారు. సర్వర్ మొరాయించటంతో లబ్ధిదారులు వెను తిరిగి వెళ్లారు. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి నారపురెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, సిద్ధాయపాలెం, ఎస్సీ పాలెం, కట్టకిందపల్లి, పుల్లాయపల్లి గ్రామాలకు 3 రేషన్ షాపులు ఉన్నాయి. మిగిలిన గ్రామాల వారు సుమారు 4 కిమీ వచ్చి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. అలాగే గంగదేవిపల్లి పంచాయతీలోని పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల వారు సుమారు 5 కిమీ వెళ్లి గంగదేవిపల్లిలో రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి. రాగమక్కపల్లి ఎస్సీ కాలనీ వారు 2 కిమీ వచ్చి ఇండ్లచెరువులో, బాదాపురం గ్రామస్తులు 2 కిమీ వచ్చి దొనకొండలో, బట్టిపాడు గ్రామస్తులు 2 కిమీ వచ్చి చందవరంలో తీసుకోవాలి. 1వ తేదే గ్రామాల్లోని ప్రజలు రేషన్‌కు విసుగి పోయిన దుస్థితి నెలకొంది.

రేషన్ కోసం ఎండలో వచ్చాను..



గత ప్రభుత్వంలో ఇంటివద్దకే వచ్చి అందించేవారు. ఈ ప్రభుత్వంలో దుకాణాల వద్దకు ఎండలో వెళ్లి లైన్లో నిలబడి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వచ్చింది. ఒక్కోసారి మేం పనులు మానుకొని రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుంది.

– గోపిరెడ్డి నాగేశ్వరమ్మ, తూర్పుగంగవరం



వీవీపురంలో మందకొడిగా రేషన్ పంపిణీ



తాళ్లూరు: నిత్యావసర సరుకులను మోసుకొని వెళ్తున్న మహిళ



గంజివారిపల్లెలో మూతవేసి ఉన్న గిరిజన రేషన్ షాపు

టీడీపీది ఎప్పుడూ వెన్నుపోటు సిద్ధాంతమే

- రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి వెన్నుపోటు పొడిచారు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల ధ్వజం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ శ్రేణులు

యర్రగొండపాలెం: రాష్ట్రంలో కూటమి నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని పెత్తనం చెలాయిస్తున్నారని, అరాచకాలు సృష్టించి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి అధ్యక్షత వహించారు. బత్తుల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అలివికాని వాగ్దానాలు చేసి, ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు తన పాలనా కాలం సంవత్సరం దాటుతున్నా ఒక్క వాగ్దానం అమలు చేయలేదని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలనే వెన్నుపోటు పొడిచారని, బాబు జీవితం వెన్నుపోటు.. టీడీపీ సిద్ధాతం వెన్ను పోటుగా మారిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ పంచుకుంటున్నారని, ఇదే ఆయన సృష్టించిన సంపదన్నారు.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది..

రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ప్రశ్నించే నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రభుత్వం అంటే కేవలం పెత్తనం చేయడం కాదని భావించిన అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను వారి ఇంటి ముంగిటకే చేరేలా చర్యలు తీసుకున్నారన్నారు. అటువంటి వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత బాబుకే దక్కుతుందని, అందుకే ఈ నెల 4న వెన్నుపోటు దినం జరుపుకుంటున్నామని, ఆయా నియోజకవర్గాల్లో జరిగే ఈ దినం కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా కార్యదర్శులు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జానకి రఘు, సింగా ప్రసాద్, పల్లె సరళ, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పప్పిశెట్టి శ్రీనివాసులు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ ఒంగోలు సుబ్బారెడ్డి, పాలిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

దొనకొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈఘటన మండలంలోని వద్దిపాడు పంచాయతీ పరిధి కలివెలపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం జరిగింది. అందిన వివరాల మేరకు.. కలివెలపల్లి గ్రామానికి చెందిన బత్తుల రామిరెడ్డి కుటుంబసభ్యులతో ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ఇంటికి తాళం వేశారు. అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో పెద్ద మంటలు వ్యాపించి ఫ్రిజ్, టీవీ, బీరువా, గృహోపకరణాలు మరికొన్ని విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. ఇంటి పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు రామిరెడ్డి వివరించారు. నష్టపోయిన రామిరెడ్డిని ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం వచ్చేలా అధికారులు చూడాలని గ్రామ సర్పంచ్ సరోజా వెంకటరెడ్డి తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రామభద్రపురం గ్రామ ఎద్దలబీడు వద్ద ఆదివారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు అందిస్తున్న దాత కైపు వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదగా రిబ్బన్ కటింగ్ చేసి మ్యాచ్ ను ప్రారంభించారు. ద్వితీయ బహుమతి జీసీసీ కమిటీ, గోల్డ్ వెంకటేశ్వర్ రెడ్డి రూ.10 వేలు, మూడో బహుమతి పుట్టా రాజు రూ.5 వేలు, నాలుగో బహుమతి కమిటీ రూ.3 వేలు బెస్ట్ బ్యాట్స్మెన్ కి బ్యాట్ జి .సుబ్బారెడ్డి , బెస్ట్ బౌలర్ కి 1500 వై. కృష్ణారెడ్డి అందించనున్నట్లు కార్య నిర్వాహకులు వెంకటేష్, కోటేశ్వరరావు, రవి, బాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దారవీడు: బైక్ అదుపుతప్పడంతో ఇద్దరి వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని చట్లమిట్ల గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని తంగిరాలపల్లి గ్రామానికి చెందిన పంచకట్ల బాలస్వామి, గుమ్మడి పెద్దకొండయ్యలు కలిసి దోర్నాల నుంచి హనుమాన్ జంక్షన్ కుంట మీదుగా గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. కుంట నుంచి జాతీయ రహదారిపై కాంట్రాక్టర్ రోడ్డుపై మట్టి కుప్పలు తోలి చదును చేయకుండా అలాగే వదిలేశారు. బైక్ నడుపుతున్న వీరికి మట్టికుప్పలు కనిపించకపోవడంతో అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.